క్లుప్తంగా

యువకుడికి చేయూత



ఊర్కొండ: మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన ఎండీ మౌలాన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం గ్రామస్తులు, మిత్రులు డబ్బులను పోగు చేసుకొని ఆదివారం రూ. 83,500 లు బాధితుడికి అందజేశారు.

బాలుడి కుటుంబానికి ఆర్థికసాయం

తిమ్మాజిపేట: మండల కేంద్రానికి చెందిన కావలి రాజు, కవిత దంపతుల కుమారుడు కార్తీక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆపరేషన్ వైద్య ఖర్చుల కోసం ఆదివారం నీలం మధు ముదిరాజ్ యువసేన సభ్యులు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. పేదలకు అండగా ఉంటామని ఎన్ఎంఆర్ ఐటీ రాష్ట్ర అధ్యక్షుడు అనుపటి రమేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. యువసేన మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, డీఎఫ్‌సీఎస్ డైరెక్టర్ ఈశ్వరయ్య, సంఘం నాయకులు వెంకటేష్, రఘు, వెంకన్న, బాలు, జగదీష్ ఉన్నారు.

'ప్రత్యేక బస్సుల పేరుతో దోపిడీ సరికాదు'

కల్వకుర్తిరూరల్: పండుగల సందర్భంగా ప్రత్యేక బస్సుల పేరుతో ఆర్టీసీ అధికారులు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ధారదాసు ఆదివారం ఒక ప్రకటన తెలిపారు. వెంటనే ఆర్టీసీ నిలువు దోపిడీ ఆపాలని కోరారు. చార్జీలను తగ్గించకుంటే బస్ భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అధికారులు స్పందించి చార్జీలు తగ్గించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలి


కొల్లాపూర్ రూరల్: విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని గాయత్రి ఎడ్యుకేషన్స్ చైర్మన్ సురగాని శ్రీనివాస్ గౌడ్, మండల పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌లు అన్నారు. ఆదివారం మండలంలోని అంకిరావుపల్లి గ్రామ సమీపంలో ఉన్న హాసిని బీపీడీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప బోనాలు



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో కురుమ యాదవులు ఆదివారం బీరప్ప బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రత్యేకంగా బోనాలను అలంకరించి ఊరేగింపుగా వెళ్లారు. పోతురాజుల విన్యాసాలతో అలరించారు. అనంతరం మహిళలు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దోమలపెంట లింగమయ్యకు..



దోమలపెంట: దోమలపెంట అటవీ చెక్‌పోస్ట్ సమీపంలోనున్న లింగమయ్యస్వామికి ఆదివారం బ్రహ్మగిరి గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ప్రతి ఏటా బ్రహ్మగిరి వాసులు శ్రావణ మాసంలో బోనాలు సమర్పించడం ఆనవాయితి. మహిళలు అధిక సంఖ్యలో ఉదయం బోనాలను తలమీద పెట్టుకుని లింగమయ్యకు నైవేద్యం పెట్టారు. గ్రామస్తులందరు క్షేమంగా, సుఖ సంతోషాలతో, ఆరోగ్యంతో జీవించాలని లింగమయ్య స్వామిని వేడుకుంటారు.

పాముల కలకలం

తెలకపల్లి: మండలంలోని గౌరారంలో పాములు రెండు రోజుల నుంచి కలకలం రేపుతున్నాయి. ఇళ్ల మధ్యనే విష సర్పాలు సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలలో చెత్త పేరుకుపోవడంతో విష సర్పాలకు నిలయంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ రైతు పొలంలోని డ్రిప్‌లో 5 పాములు కనిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. కాలనీలలో చెత్త తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బీటీ కల నెరవేరేనా?

- అధ్వానంగా రామాజిపల్లి-కొండనాగుల రహదారి
- నేడు బీటీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న మంత్రులు



బురదమయంగా మారిన కొండనాగుల-రామాజిపల్లి రహదారి

బల్మూర్: గ్రామాలకు బీటీ రోడ్లు వేస్తామంటూ పాలకులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షకాలంలో రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. మట్టి రోడ్లను బురద రోజుల తరబడి ఉండటంతో అడుగుతీయలేని పరిస్థితి దాపురిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

హామీలకే పరిమితం

మండలంలోని కొండనాగుల వయా వీరంరాజుపల్లి-రామాజిపల్లి సుమారు నాలుగు కిలో మీటర్ల రహదారి బీటీకి నోచుకోవడం లేదు. గుంతలలో వర్షం నీరు నిల్వ ఉంటోంది. 20 ఏళ్లుగా ఈ రోడ్లను బీటీగా మారుస్తామని పాలకులు హామీలు ఇస్తూనే ఉన్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు వాగ్ధానాలు ఇస్తున్నా అమలుకు మాత్రం నోచుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వర్షకాలం వచ్చిందంటే చాలు రామాజిపల్లి నుంచి కొండనాగులకు నడిచే బస్సు కూడా రద్దు చేస్తుండటంతో కొండనాగుల పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు, వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలు కాలినడకనే వెళ్లాల్సిన పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. దీంతో పాటు వీరంరాజుపల్లి నుంచి మండల కేంద్రానికి వెళ్లే రహదారి, అచ్చంపేటకు వెళ్లే రోడ్ల పరిస్థితి ఇలాగే ఉన్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు.

నేడు మంత్రుల శంకుస్థాపన

రామాజిపల్లి నుంచి వీరంరాజుపల్లి మీదుగా కొండనాగుల వరకు 3.7కిల్లో మీటర్ల దూరం పీఆర్ నిధులు రూ.3 కోట్లతో బీటీ రోడ్డు మంజూరయ్యాయి. సోమవారం మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామిలతో పాటు ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ శంకుస్థాపన చేయనున్నారు. గతంలో కూడా, టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో కూడా పాలకులు, అధికారులు రామాజిపల్లి-కొండనాగులకు బీటీ మంజూరైందని ప్రకటించారు. కాని అది అప్పట్లో అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం ఈ రోడ్డుకు మంత్రులు శంకుస్థాపన రోడ్డు నిర్మాణం చేపడుతారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రజలు ఒక వైపు హర్షిస్తున్నా... మరో వైపు వీరంరాజుపల్లి మీదుగా బల్మూర్ మండల కేంద్రానికి వెళ్లే రహదారికి బీటీగా మార్చేందుకు నిధులు మంజూరు చేయక పోవడంతో దిగాలు చెందుతున్నారు. ఈ రహదారికి కూడా నిధులు మంజూరు చేస్తే చెన్నారం, మహదేవ్‌పూర్, రామాజిపల్లి, వీరంరాజుపల్లి గ్రామాలకు చెందిన ప్రజలకు అనువుగా మండల కేంద్రానికి దూరం తగ్గుతుందని పలువురు పేర్కొన్నారు.

బీటీ నిర్మించాలి



వీరంరాజుపల్లి నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డును కూడా బీటీగా మార్చేందుకు నిధులు మంజూరు చేయాలి. దీంతో నాలుగు గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. అధికారులు స్పందించి బీటీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

–పిట్టల మల్లేష్, డ్రైవర్, వీరంరాజుపల్లి

నిధులు మంజూరయ్యాయి

రామాజిపల్లి నుంచి కొండనాగుల వరకు మాత్రమే బీటీ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. వీరంరాజుపల్లి నుంచి మండల కేంద్రం, అచ్చంపేట వెళ్లే రోడ్లకు నిధుల మంజూరు కాలేదు. పై అధికారులు తెలిపితే ప్రతిపాదనలు పంపిస్తాం.

–శ్రీనువాసులు, పీఆర్ ఏఈ, బల్మూర్

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



చెంచుల వేషధరణలో చిన్నారి విద్యార్థులు

మన్ననూర్: స్థానిక పీటీజీ (బాలురు)పాఠశాల/కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆదివారం ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ చెంచు విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ఆదివాసీల సంస్కృతి సాంప్రదాలు ఉట్టిపడే విధమైన వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐనోలు గురుకులంలో..

అచ్చంపేట రూరల్: మండలంలోని ఐనోలు గిరిజన బాలికల గురుకులంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. చెంచుల అటవీ ఆవాసమైన గుడిసెను నిర్మించారు. ఆదివాసీ హక్కుల పోరాట యోధుడు కొమరం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పలత మాట్లాడుతూ తెలంగాణలో దాదాపు 40 లక్షల మంది గిరిజనులు ఉన్నారన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సువర్ణ, ఉపాధ్యాయులు అనురాధ, శేఖర్, పర్వతాలు, గణేష్, పీఈడీ రాజ్యలక్ష్మి, ఉమాదేవి, రాధ, జ్యోతమ్మ, చిన్న హుస్సేన్, రమేష్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ స్పష్టత ఇవ్వాలి



తాడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



అచ్చంపేటలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: బీసీ రిజర్వేషన్ల అమలులో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు కొల్లాపూర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అమలు కోసం బీజేపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్ రాష్ట్రపతి ఆమోదించాలన్నారు. రిజర్వేషన్ల అమలుకోసం సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శివవర్మ, సలీం, రాజు, బాలు నాయక్, సాయికుమార్, రామకృష్ణ ఉన్నారు.

తాడూరు: బీసీ రిజర్వేషన్‌పై బీజేపీ స్పష్టత ఇవ్వాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అంతారంలో డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ కమిటీ సమావేశంలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, వినయ్, కుర్మయ్య, బంగారయ్య, పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సైదులు, రాములు, నిర్మల, శివ, అమరేందర్, నవీన్, పర్వతాలు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ప్రసాద్ మాట్లాడుతూ రేజర్వేషన్లపై బీజేపీ ద్వంద నీతి ప్రదర్శిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో ఆర్ శ్రీనివాసులు, ఆంజనేయులు, ఏపీ మల్లయ్య, పరశురాములు, కృష్ణారెడ్డి, చెన్నయ్య, శ్రీనివాసులు, బాలయ్య, జగన్, మహేష్ పాల్గొన్నారు.

అడక్వసి విధానాన్ని సవరించాలి



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ లక్ష్మణ్‌నాయక్

కందనూలు: జిల్లా కేంద్రంలోని పాత కలెక్టర్ భవనం ఎదుట అడక్వసి వ్యతిరేక పోరాట సమితి నాగర్ కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మణ్‌నాయక్ మాట్లాడుతూ జీఓ నంబర్ 2లో అడక్వసి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాలలో పదోన్నతులలో రిజర్వేషన్ విధానాన్ని అడక్వసితో సంబంధం లేకుండా ఇవ్వాలన్నారు. జనరల్ కేటగిరిలో నియామకమైన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను జనరల్ కేటగిరీలోని పదోన్నతి ఇవ్వాలని కోరారు. వారిని రిజర్వేషన్లతో భర్తీ చేయొద్దన్నారు. ప్రమోషన్లలో రిజర్వేషన్ కోటాను పక్కాగా అమలు చేయాలని, ఎస్సీ, ఎస్టీ మెరిట్ అభ్యర్థులకు మెరిట్‌లోనే పదోన్నతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాకు పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి హాజరై జీఓ నంబర్ 2ను సవరించాలని కోరారు. వివిధ పార్టీల నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వంకేశ్వరం నిరంజన్ ధర్మా టీచర్స్ యూనిటీ నాయకులు గుడిపల్లి నిరంజన్, కొంగరి జానయ్య, ప్రభాకర్, ఎదిరేపల్లి కాశన్న, బోనాసి రామచందర్, సీపీఐ నాయకులు ఆనంద్, గడ్డం విజయ్, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

కవులకు, కళాకారులకు ప్రభుత్వం ప్రాధాన్యం

అచ్చంపేట: కవులకు, కళాకారులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో కవులు రచించిన నాలుగు గ్రంథాలను ఆయన ఆవిష్కరించారు. కపిలవాయి అశోక్‌బాబు, బంధం శ్రీనివాసులు, దేవకాటమరాజు నర్సింహులు, పిజయచంద్రారెడ్డి, ఉప్పు మురళీధర్, ఎంజీరెడ్డిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డు ఇంజనీయర్ బంధం బాల్ లక్ష్మయ్య, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, డాక్టర్ బాల్‌నారాయణ, కాశన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లి జన్మదిన వేడుకలు



కొల్లాపూర్/పెద్దకొత్తపల్లి/పెంట్లవెల్లి: నాగర్‌జిల్లాలోని పలు మండలాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని ఫారెస్టు ఆఫీసులో పనిచేస్తున్న ప్రొటెక్షన్ వాచర్లకు కాంగ్రెస్ నాయకులు వంగ రాజశేఖర్‌గౌడ్ దుప్పట్లు అందజేశారు. శ్రీవాణి విద్యానిలయంలో టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పేదలకు దుస్తులు ఆయన పంపిణీ చేశారు. పెద్దకొత్తపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ, పెంట్లవెల్లిలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో 160 మంది విద్యార్థినులకు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కబీర్ సొంత ఖర్చులతో బెడ్‌షీట్లు అందజేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ముజీబ్ ఘోరీ, న్యాయవాది మధుసూధన్‌రావు, నాయకులు రాముయాదవ్, వాచర్లు ఉన్నారు.

తగ్గని దుందుభీ ఉధృతి



తాడూరు: మండలంలోని పాపగల్ నుంచి ప్రారంభమయ్యే దుందుభీ వాగు ఉధృతి కొనసాగుతోంది. వరద వేగం పెరగడంతో ఆయా గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. వాగు దాటి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగు అవలి ఒడ్డున ఉన్న రైతులకు సంబంధించిన పొలాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. వాగు దాటి వెళ్లాలంటే మరో వారం రోజులు పట్టవచ్చని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు.

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదాం



అచ్చంపేట రూరల్: గిరిజన హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడుదామని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం అచ్చంపేటలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వాల్యానాయక్, శోభన్, చందర్, తదితరులు పాల్గొన్నారు.

అలుగులు పారుతున్న చెరువులు



తెలకపల్లి: రెండు రోజుల కిందట కురిసిన భారీ వర్షానికి మండలంలోని చెరువులకు జలకళ సంతరించుకుంది. మండలంలోని దాసుపల్లి, తెలకపల్లి, అలుగులు పారుతున్నాయి. భారీ వర్షం రావడంతో చెరువులు, కుంటల నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మత్స్య కారులు అలుగుల వద్ద చెపల వేట కొనసాగిస్తున్నారు.

విద్యార్థులకు బహుమతులు

అచ్చంపేట రూరల్: చదువుల్లో రాణించిన విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని భక్తమార్కండేయ పద్మశాలి కమ్యూనిటీ హాలులో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో 986 మార్కులు సాధించిన వనం కౌశిక్, 963 మార్కులు సాధించిన గంజి హర్షిత ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. అలాగే పదవ తరగతిలో ఎల్లికంటి కీర్తన 569, ఏలే జశ్వంత్ 563 మార్కులతో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. నీట్‌లో 97 పర్సెంటేజ్‌తో సీటు సాధించిన మాకం అరుణ్ తేజకు మెమెంటోను అందజేశారు. అలాగే కోలాటం మాస్టర్ కర్నాటి నవీన్, దాసపత్రి శకుంతలను శాలువాతో సన్మానించారు. శ్రీనివాసులు, కిషోర్, రవీందర్, సుధాకర్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ప్రశాంతి సన్నిధిలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో 346 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రతి నెలలో రెండు, నాలుగు ఆదివారాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా కంటి, డయాబెటిస్ పరీక్షలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. వైద్యులు కృష్ణ, చంద్రకాంత్, రాజేష్, సాయి చరణ్, హరీష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనం చోరీ అయిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని నాగనూలు గ్రామానికి చెందిన శ్రీరాంకు సంబంధించిన ద్విచక్రవాహనాన్ని గ్రామ రోడ్డులో నిలిపాడు. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను చోరీ చేశారు. గమనించిన బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. చోరీకి సంబందించిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కాగ వారం రోజుల నుంచి ద్విచక్రవాహనాలు చోరీలు చోటుచేసుకుంటుండంతో ప్రజలు భయాందోళనక గురవుతున్నారు.

అందుబాటులో ఎరువులు

తాడూరు: మండల కేంద్రంలోని ఆయా గ్రామాల రైతులకు యూరియా అందుబాటులో ఉందని రైతులు అధైర్యపడొద్దని సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం సెలవురోజు అయినప్పటికి కూడా సిబ్బందిని అందుబాటులో ఉంచి వచ్చిన రైతులకు ఇబ్బందులు కలగకుండా ఆధార్ కార్డు, పాస్‌బుక్ తెచ్చిన వారికి ఎరువులను అందిస్తున్నామని వివరించారు. వర్షాలు కురుస్తున్నందున యూరియాకు బాగా డిమాండ్ పెరిగిందని పేర్కొన్నారు.

ముత్యాలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు

వెల్దండ: మండలంలోని నారాయపూర్‌తండాలో ముత్యాలమ్మ దేవతకు ఆదివారం గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు, పశుసంపదను కాపాడాలని వేడుకున్నారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.



ప్రారంభమైన తీజ్

లింగాల: బంజారాలు నిర్వహించే పండుగలలో తీజ్ పండుగకు ప్రత్యేక విశిష్టత ఉంది. గిరిజనులైన లంబాడాలు నిర్వహించే తీజ్‌కు నల్లమల ప్రాంతంలో ఓ ప్రత్యేక ఉంది. మండలంలోని లింగాల సూరాపూర్, పద్మన్నపల్లి, మగ్దూంపూర్ గ్రామాల గిరిజనులు వైభవంగా నిర్వహించారు. మహిళలు, యువతులు, యువకులు సాంప్రదాయ నృత్యాలు, ఆటపాటలతో తొమ్మిది రోజుల పాటు వేడకలు జరుపుకుంటారు. తీజ్‌ను కేవలం తండాల్లో పెళ్లి కాని గిరిజన యువతులు మాత్రమే ముందుండి నిర్వహిస్తుంటారు. శ్రావణ మాసం ప్రారంభంలో తీజ్‌ను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. యువతులు తెల్లవారుజామునే స్నానమాచరించి సోదరులతో కలిసి సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి పుట్టమన్ను తెచ్చి అందులో పశువుల ఎరువును కలుపుతారు. తండాలోని పెద్దతో బుట్టలలో మట్టిని వేయించి అందులో గోధుమలను చల్లుతారు. ఇలా తయారు చేసిన బుట్టలను తండా పెద్ద ఇంటి ఎదుట వెదురు బొంగుతో తయారు చేసిన మంచెపై ఉంచుతారు. బుట్టలలో మొలకలు వచ్చే వరకు తొమ్మిది రోజుల పాటు నిత్యం మూడు సార్లు వాగు లేదా బావుల నీళ్లను తీసుకవచ్చి చల్లుతారు. బుట్టల దగ్గర సేవాలాల్ మహారాజ్, దండిమేరామయాడీలను నిష్టతో పూజిస్తూ తీజ్‌ను జరుపుకుంటారు.



తీజ్ బుట్టలకు నీళ్లు తీసుకెళ్తున్న బంజార యువతులు

తండాలలో పండుగ వాతావరణం

తండాలలో తీజ్ ఉత్సవాలు మొదలు కావడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఉత్సవాల సందర్భంగా బంజారాలకు సంబంధించి బంధువులు రాక పోకడలతో తండాలు సందడిగా మారాయి.

9 రోజుల పాటు నిష్ట

తీజ్ ప్రారంభం రోజు ఏర్పాటు చేసిన బుట్టలలో నవధాన్యాలతో పాటు గోధుమలను పోసి ఆడపడుచులు ఉపవాస దీక్షలు ఉంటూ ప్రతి రోజు రెండు పూటల నీళ్లు పోసి బుట్టలతో మొలకలను పెంచుతారు. ప్రతి రోజు సాయంత్రం సమయంలో బంజారా నృత్యాలు, ఆటపాటలతో తీజ్ బుట్టలకు పూజలు నిర్వహిస్తారు. లంబాడ భాషలో తీజ్ అనగా గోధుమ మొలకలని అర్థం. బతుకమ్మలను పూలతో అలంకరించిన మాదిరిగా బంజారాలు తీజ్ బుట్టలను అలంకిస్తారు. చివరి రోజు ఆడపడుచులు తీజ్ బుట్టలను తలపై వేడుకలతో సమీపంలోని చెరువులు, కుంటలలో నిమజ్జనం చేస్తారు.


భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి

అచ్చంపేట రూరల్: కుల మతాలకతీతంగా అందరి పండుగలను అందరూ కలిసిమెలిసి జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని చౌటపల్లి గ్రామంలో నిర్వహించిన తీజ్ సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గిరిజనులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. తీజ్ బంజారుల సంస్కృతికి అద్దంపడుతుందన్నారు. కార్యక్రమంలో బంజారా సోదరులు, కాంగ్రెస్ నాయకులు జేమ్లా నాయక్, పాండు, మౌలానా, రఘుపతి, గణేష్, వెంకటయ్య, చంద్రమౌళి, తిర్పతి, హరీష్, శివ, వీరయ్య, సైదులు పాల్గొన్నారు.



చౌటపల్లిలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

స్వేరో బలోపేతానికి కృషి



చారకొండ: స్వేరో బలోపేతానికి కృషి చేస్తానని సీనియన్ స్వేరో నాయకులు దుబ్బ నాగేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్వేరో ముఖ్య నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన జ్ఞాన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం స్వేరో మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పసుల పాపయ్యతో పలువురును ఎన్నుకున్నారు. నాయకులు అచ్చంపేట్ నియోజక వర్గ ఇన్‌చార్జ్‌శివశంకర్, బల్మూర్ మల్లేష్, అర్జున్, రాంబాబు, రమేష్, రాజు తదితరులు ఉన్నారు.